

పుట్టగొడుగుల పెంపకం ఉపాధికి మార్గం

పుట్టగొడుగుల పెంపకం లాభదాయకమని కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. 8లో



అమ్మవారి ఉత్సవం చూతము రారండి

పాత సుజనకోటలో గంగమ్మతల్లి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో



ఎస్‌ఐ ప్రిలిమినరీ పరీక్షకు 87.7 శాతం హాజరు

ఎస్‌ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష విశాఖ నగరంలో ప్రశాంతంగా జరిగింది. 8లో

జాతరకు వెళ్లొస్తామని..

- తిరిగిరాని లోకాలకు
- దారికాసిన మృత్యువు
- ముగ్గురి ప్రాణాలను పొట్టను పెట్టుకున్న రోడ్డు ప్రమాదం
- కుటుంబ సభ్యులకు తీరని శోకం
- దిగసల్తాంగి గ్రామంలో విషాదం



మృతదేహాలను పరిశీలిస్తున్న అనంతగిరి ఎస్‌ఐ కరక రాము, జెడ్పీటీసీ గంగరాజు, తదితరులు

అనంతగిరి: శివరాత్రి జాతర తిలకించేందుకు వెళ్లిన ముగ్గురిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. పేద కుటుంబాలను దిక్కులేని వారిని చేసింది. డముకు-నిమ్మలపాడు రోడ్డులోని రాయిపాడు సమీప మలుపు వద్ద సంభవించిన ప్రమాదంలో వారి మృతికి నిద్రమత్తు, అతివేగమే కారణంగా తెలుస్తోంది. ఈ ఘటనలో హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ దిగసల్తాంగి గ్రామానికి చెందిన రాపా బుట్టన్న (35) అదే గ్రామానికి చెందిన సీదరి రాంబాబు(21), బొండం గణేష్ (18) మృతి చెందారు. బొర్రా, లుంగపర్తి ప్రాంతాల్లోని శివరాత్రి జాతరను తిలకించి ఆదివారం ఉదయం బైక్‌పై స్వగ్రామం వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. బైక్ అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టడంతో వారు లోయలోకి ఎగిరిపడి ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతి ఆయా కుటుంబాలకు తీరని శోకం మిగిల్చింది.

మాకు దిక్కెవరు..? :

బుట్టన్న భార్య సన్యాసమ్మ రోదన : మృతుడు రాపా బుట్టన్నకు వ్యవసాయమే జీవనాధారం. అతనికి భార్య సన్యాసమ్మ, ముగ్గురు సంతానం. వీరిలో పెద్దకుమారుడు దాసు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుట్టన్నపై ఆధారపడిన కుటుంబం అతని మృతితో పోషించే దిక్కును కోల్పోయింది. కుమారుడు మృతితో మనస్తాపంతో ఉన్న బుట్టన్న మనసు బాగోలేనందున జాతరకు వెళ్లి వస్తానని ఇంటినుంచి వెళ్లాడు. అతని రాకకోసం ఎదురుచూస్తున్న కుటుంబానికి పిడుగులాంటి వార్త చెవిన పడింది. కుటుంబసభ్యులు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చారు. జాతరకు వెళ్లి వస్తానని చెప్పి, తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావా.. మరి నాకు దిక్కెవరు.. మమ్మల్ని అనాథలను చేశావా అంటూ భార్య సన్యాసమ్మ రోదించడం అక్కడివారిని కలచివేసింది.

అదే చివరిమాట.. : అమ్మా.. మేము కూడా జాతరకు వెళ్లి వస్తామని వెళ్లిన సీదరి రాంబాబు (21), బొండం గణేష్ (18)ల మరణవార్త ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. వీరిద్దరూ అవివాహితులు. బొండం అప్పలస్వామి, రాములమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో గణేష్ రెండో కుమారుడు బొండం గణేష్. ఇంటర్ వరకు చదివాడు. ఇంటివద్దే ఉంటున్న అతను వ్యవసాయపనుల్లో తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. కుమారుడి మరణవార్త వినిన తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. గుండెలవిసేలా రోదించారు. సీదరి బస్సులు, ముత్యాలమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో పెద్ద కుమారుడు సీదరి రాంబాబు ఎస్.కోటలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఎస్.కోటలో ఉంటున్న రాంబాబు కుటుంబ సభ్యులను చూసేందుకు ఇంటికి వచ్చాడు. జాతర చూసేందుకు వెళ్లిన అతనిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది.

మిన్నంటిన ఆర్తనాదాలు : ప్రమాద సమాచారం తెలుసుకున్న మృతుల కుటుంబసభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని రోదించారు. వారితోపాటు బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను అరకు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు కూడా అక్కడికి చేరుకున్నారు. నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలకు అప్పగిస్తామని బాధిత కుటుంబాలకు అప్పగిస్తామని ఎస్‌ఐ కరక రాము తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

అనంతగిరి జెడ్పీటీసీ దీసరి గంగరాజు, వాలాసి, టోకూరు సర్పంచ్‌లు సన్యాసిరావు, మోస్య, మాజీ సర్పంచ్ గురుమూర్తి తదితరులు ప్రమాద ఘటన స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు.





మృతులు బుట్టన్న, గణేష్, రాంబాబు (ఫైల్)



విషణ్ణ వదనంలో బుట్టన్న భార్య సన్యాసమ్మ, ఇద్దరు పిల్లలు



ప్రమాదం జరిగిన రాయపాడు మలుపు ప్రాంతం

లారీ ఢీకొని యువకుడు..

చింతూరు: మండలంలోని సింగన్నగూడెం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో రత్నాపురానికి చెందిన వంజం పాండురాజు(28) అనే యువకుడు మృతిచెందాడు. పాండురాజు ద్విచక్ర వాహనంపై ఏడుగురాళ్లపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో సింగన్నగూడెం వద్ద తమిళనాడుకు చెందిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.



పాండురాజు మృతదేహం


న్యూస్‌రీల్

గోదావరిలో ఇద్దరు యువకుల గల్లంతు

- భద్రాచలం వాసులుగా గుర్తింపు

ఎటపాక: ఎటపాక వద్ద గోదావరి నదిలో స్నానాలు దిగిన యువకుల్లో ఇద్దరు గల్లంతయ్యారు. సరిహద్దునే ఉన్న తెలంగాణ రాష్ట్రం భద్రాచలం పట్టణం అశోక్‌నగర్ కాలనీకి చెందిన ఐదుగురు పదవ తరగతి విద్యార్థులు ఆదివారం సాయంత్రం ఎటపాకలోని మేడువాయి సమీపంలోని గోదావరిలో స్నానాలకు దిగారు. వీరంతా లోతులో మునిగిపోతుండగా వీరిలో ఈత వచ్చిన యువకుడు ఇద్దరిని కాపాడాడు. మిగతా ఇద్దరు గల్లంతయ్యారు. బయటకు వచ్చిన ముగ్గురు యువకులు అక్కడి నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. గల్లంతైన అక్బర్‌బాషా (17), వాసు (16) ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ముగ్గురు యువకులను నిలదీయగా జరిగిన విషయాన్ని చెప్పారు. దీంతో కాలనీవాసులు భద్రాచలం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి వెళ్లిన వారు పరిధి తమది కాదంటూ స్థానిక పోలీసులకు సమాచారం అందజేసి వెళ్లిపోయారు. వెంటనే ఎస్‌ఐ పార్థసారథి సిబ్బందితో ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

సినిమా షూటింగ్ సందడి



హీరో, హీరోయిన్లపై ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతం వద్ద శనివారం రాత్రి సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ప్రముఖ సినీనటుడు బ్రహ్మాజీ తనయుడు సంజీవరావు హీరోగా, అయుశా హీరోయిన్‌గా నటిస్తున్న నూతన చిత్రం 'గుట్టు చప్పుడు' సినిమాలో ఒక పాటను ఇక్కడ చిత్రీకరించారు. ఈ సినిమాకు డైరెక్టర్‌గా మణింద్రన్, ప్రొడ్యూసర్‌గా లివింగ్ స్టన్, డ్యాన్స్ మాస్టర్‌గా ప్రశాంత్ వ్యవరిస్తున్నారు. మేనేజర్ నవీన్‌కుమార్, సూపర్‌వైజర్ అభి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన ఆర్టీసీ బస్సు



సీలేరులో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

సీలేరు: నర్సీపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులో సాంకేతిక లోపం తలెత్తడంతో సీలేరులో ఆదివారం నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రెగ్యులర్‌గా నర్సీపట్నం నుంచి సీలేరు రావలసిన బస్సు వేరే ప్రాంతానికి పంపించగా, నర్సీపట్నం నుంచి చింతపల్లి మధ్య తిరిగే టూ స్టాప్ బస్సు సర్వీసును ప్రత్యామ్నాయంగా సీలేరు పంపించారు. ఈ బస్సు గేర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి సాయంత్రం 6.30 గంటలకు బస్సును సిద్ధం చేసి తీసుకువెళ్లారు.

22న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ (ఎస్సీ,ఎస్టీ) అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. శివశంకర్ మోటార్స్(టాటా మోటార్స్)లో 50 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్ లీడర్స్, టెక్నీషియన్స్, సర్వీస్ అడ్వైజర్లు, పెయింటర్స్, డెంటర్, టెలికాలర్స్, సర్వేయర్స్, మేనేజర్స్ ఉద్యోగాలకు ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీకామ్ (టాలీ)లో ఉత్తీర్ణత సాధించి 18-35 సంవత్సరాల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలకు జీతం నెలకు రూ.12,000 నుంచి రూ.35,000 లు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncr.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

ఎస్.రాయవరం : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమయిన పంటలు, మంచి దిగుబడులు వస్తాయని అనకాపల్లి జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న అన్నారు. గోకులపాడు గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయం-సాగువిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించారు.

అడవి కన్నీరు

- పచ్చని వృక్షాలకు రంపపు కోత
- అంతరించి పోతున్న విలువైన చెట్లు
- బడదనాంపల్లి రక్షిత అటవీప్రాంతంలో నరికివేత



రాజవొమ్మంగి అటవీ క్షేత్రంలోని అక్రమార్కుల కోతకు గురైన విలువైన చెట్టు



బడదనాంపల్లి అటవీ ప్రాంతంలో రంపపు కోతకు గురై నేలవాలిన చెట్లు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి అటవీక్షేత్రంలోని బడదనాంపల్లి ఫారెస్ట్ బీటులో పచ్చని అడవిపై రంపపు కోత మొదలైంది. రెండు రోజుల క్రితం ఈ ప్రాంతంలో దాదాపు ఐదు హెక్టార్ల విస్తీర్ణంలో భారీ చెట్లు గొడ్డలివేటుకు గురయ్యాయి. కలప అక్రమరవాణా కోసమే అక్రమార్కులు ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు సమాచారం. సంబంధిత అటవీ అధికారుల పర్యవేక్షణ కొరవడటమే ఇందుకు కారణమన్న విమర్శలున్నాయి. అక్రమార్కుల నరికివేతకు గురవుతున్న విలువైన చెట్లలో గంధ్ర, వేగిస, మద్ది, తెల్లమద్ది, అల్లి, బండారు తదితర మారుజాతి కలప రకాలు ఉన్నాయి. మరోవైపు ఎక్కడ చూసినా విలువైన వృక్ష సంపద నేలవాలుతుంటే ప్రకృతి ప్రేమికులు ఈ దృశ్యాలను చూసి చలించిపోతున్నారు.

వంట చెరకు రూపంలో..

అక్రమార్కులు పచ్చని చెట్లను మిషన్ రంపం (హ్యాండ్ సా)తో కూల్చివేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ఈ చెట్లను ముక్కలుగా మార్చి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై వంట చెరకుకు తరలిస్తున్నారు. ఈ విధంగా రాజవొమ్మంగి అటవీక్షేత్రం నుంచి ప్రతిరోజు దాదాపు 10 టన్నుల కలప అటవీప్రాంతం నుంచి తరలిపోతోంది. దీంతో పచ్చని అడవులు బీడువారుతున్నాయి. సంబంధిత అటవీ అధికారులు ఈ పరిస్థితిని చక్కదిద్దక పోతే అడవి అంతరించి పోయే పరిస్థితి ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గట్టి నిఘా ఏర్పాటు



బడదనాంపల్లి అడవుల్లో చెట్లు నరికివేసినట్లు సమాచారం అందడంతో దాడి జరిపాం. ఇద్దరిలో ఒకరు పరారీ కాగా ఒకరిని పట్టుకున్నాం. అతను కూడా తప్పించుకొని పరారయ్యాడు. వీరు పక్క మండలానికి చెందిన కోది జాతి ఆదివాసీలుగా భావిస్తున్నాం. రెండు హెక్టార్లలో అడవిలో చెట్లను నరికినట్టు అంచనా వేస్తున్నాం. గట్టి నిఘా ఏర్పాటుచేస్తాం.

– అబ్బాయిదొర, అటవీక్షేత్రాధికారి, రాజవొమ్మంగి

త్వరలో టీడీపీ దుకాణం బంద్

ఎమ్మెల్సీ టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరామమూర్తి



మాట్లాడుతున్న ఈర్లె శ్రీరామమూర్తి

యలమంచిలి: టీడీపీ దుకాణాన్ని చంద్రబాబు త్వరలోనే బంద్ చేసుకుంటాడని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న ఈర్లె శ్రీరామమూర్తి అన్నారు. మాజీ మంత్రి, టీడీపీ నేత అయ్యన్న పాత్రుడు బీసీ ద్రోహి అని, అయ్యన్న లాంటి దగాకోరులతో టీడీపీ భ్రష్టుపట్టిపోయిందని మండిపడ్డారు. తనకు రావలసిన ఎమ్మెల్సీ టికెట్‌ను అయ్యన్న కుట్రలు పన్ని మరో వ్యక్తికి కట్టబెట్టారని ఆరోపించారు. అయ్యన్న భాష వల్ల టీడీపీకి తీరని నష్టం జరుగుతోందన్నారు. త్వరలోనే బీసీల ఉన్నతికి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తానని చెప్పారు. చంద్రబాబు తనకు గతంలో చోడవరం ఎమ్మెల్యే టికెట్ ఆఫర్ చేయగా అయ్యన్న మోకాలడ్డాడని.. తర్వాత రాష్ట్ర ఆర్టీఐ కమిషన్ సభ్యుడిగా చంద్రబాబు తనను సిఫార్సు చేస్తే తనపై వేరేవారితో గవర్నర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేయించి అప్పుడూ అయ్యన్నే అడ్డుకున్నాడని ఆరోపించారు. అయ్యన్నపాత్రుడి బ్లాక్‌మెయిలింగ్ కి చంద్రబాబు లొంగిపోయారని చెప్పారు.

గోదావరి డెల్టాకు అదనపు నీరు విడుదల

- జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్

సీలేరు: ఉభయగోదావరి జిల్లాల పంట భూములకు సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ నుంచి అదనపు నీటిని ఆదివారం రాత్రి 7 గంటలకు విడుదల చేసినట్లు జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రబీ పంటకు అత్యవసరంగా నీటి విడుదల విషయమై నాలుగు రోజుల క్రితం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జెన్‌కో, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. పంటలకు నీటి ఎద్దడి లేకుండా సకాలంలో నీటిని సరఫరా చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. దీంతో సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి మెయిన్ డ్యాం నుంచి విద్యుత్ ఉత్పత్తితో సంబంధం లేకుండా నేరుగా గోదావరి డెల్టాకు మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని వివరించారు. ఇరిగేషన్ అధికారుల ఆదేశాలతో వారం రోజుల పాటు సాగునీరు విడుదల చేయడం జరుగుతుందన్నారు. దీనితో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 4,300 క్యూసెక్కుల నీరు వెళ్తుందని, సీలేరు కాంప్లెక్స్‌లో 8 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతోందని ఆయన తెలిపారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

కాకినాడ జిల్లా సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త శ్రీనివాసరావు



విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న శ్రీనివాసరావు



విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

మారేడుమిల్లి: విద్యార్థులు శాస్త్రవేత్తల స్థాయికి ఎదగాలని కాకినాడ జిల్లా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు కోరారు. వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవరపల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో జాతీయ సైన్స్ కాంగ్రెస్ దినోత్సవం పక్షోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా సైన్స్ క్విజ్, సైన్స్ నమూనాలు, వ్యాసరచన పోటీలను ఆదివారం నిర్వహించారు. వీటిలో 142 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాకినాడ జిల్లా జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం డి.నాగేశ్వర రావు మాట్లాడుతూ పరిశోధనలతో దేశాభివృద్ధి సాధ్యమన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ దొర మాట్లాడుతూ సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకునేందుకు దోహద పడతాయన్నారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం ఎల్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఎస్. కోటేశ్వరరావు, ఎం. వీరారెడ్డి, వై.సతీష్, సీహెచ్ శ్రీనివాస కిరణ్, బాలకుమార్ పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రయోగ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- ఈ సారి నాన్ జంబ్లింగ్ విధానంలోనే పరీక్షలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 207 కేంద్రాలు
- హాజరుకానున్న 21,279 మంది విద్యార్థులు



ప్రాక్టికల్స్‌కు సిద్ధమవుతున్న పెందుర్తి కాలేజీ ఒకేషనల్ విద్యార్థులు



విశాఖలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఐవో ఉమారాణి

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలకు అంతా సిద్ధమైంది. సోమవారం ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26 నుంచి జనరల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఈ సారి విద్యార్థులు చదువుకున్న కాలేజీల్లోనే(నాన్ జంబ్లింగ్) ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కేంద్రాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరగనున్నాయి. ఈ సీసీ కెమెరాలను ఇంటర్మీడియెట్ ఆర్‌ఐవో కార్యాలయంతో పాటు, కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కేంద్రాల్లోని చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లతో పాటు, ఉన్నతాధికారులు సైతం పరీక్షలపై నేరుగా పర్యవేక్షణ చేయనున్నారు.

ఉమ్మడి విశాఖలో 21,279 మంది

విశాఖలో 126 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇక్కడ ఎంపీసీ 11,079 మంది, బైపీసీ 2,655 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు. అనకాపల్లిలో 65 కేంద్రాల్లో ఎంపీసీ 4,187 మంది, బైపీసీ 1,575 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 16 కేంద్రాల్లో ఎంపీసీ 1,173 మంది, బైపీసీ 610 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 207 పరీక్ష కేంద్రాల్లో మార్చి 7వ తేదీ వరకు రెండు పూటలా ప్రయోగ పరీక్షలు జరుగుతాయి.

కార్పొరేట్‌కు ఆగడాలకు చెక్ పెట్టేలా..

విద్యార్థులు చదువుకున్న కాలేజీల్లోనే ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్నందున మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తుండటం, 153 ప్రైవేటు కాలేజీల్లో కేంద్రాలు ఉండటంతో ఇలాంటి చోట్ల నిఘా పెంచారు. ఇంటర్మీడియెట్ మార్కుల ప్రాధాన్యత దృష్ట్యా కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల నిర్వాహకులు విద్యార్థులు ఎక్కువ మార్కులు వేసేలా ఇన్విజిలేటర్లకు ప్రలోభాలకు గురిచేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో బోర్డు అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రద్ధ తీసుకున్నాం. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థులకు ఆల్ ద బెస్ట్.

– పి.ఉమారాణి, ఆర్‌ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

ఘనంగా ముగిసిన మత్స్యగుండం జాతర



మత్స్యలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ

మత్స్యగుండం వద్ద భక్తులు

హుకుంపేట: ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతం పవిత్ర మత్స్యగుండంలో శివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరిరోజు కూడా భక్తులు భారీగానే మత్స్యగుండం చేరుకున్నారు. సాయంత్రం వరకు మత్స్యలింగేశ్వరస్వామికి భక్తులు పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ తదితర నేతలు మత్స్యలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో తాపీమేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు తహసీల్దార్, ఎంపీడీవో వెంకటరావు, సీఐ సుధాకర్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కృషి చేశారు.



మత్స్యగుండం ఆలయంలో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్,ఇతర నాయకులు

అమ్మవారి ఉత్సవం చూతము రారండి!

- నేటి నుంచి సుజనకోటలో గంగమ్మ తల్లి ఉత్సవాలు
- పూర్తయిన ఏర్పాట్లు



విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారి ఆలయం



అమ్మవారి వేడుక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రమేష్, ఉత్సవ కమిటీ సభ్యులు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండలం పాత సుజనకోట గ్రామంలో వెలసిన శ్రీ గంగమ్మతల్లి ఉత్సవాలను ఈ నెల 20, 21 తేదీల్లో ఘనంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా గంగమ్మతల్లి ఉత్సవాలను గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం పెద్ద ఎత్తున జరుగుతాయి. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా కొలువైన గంగమ్మ తల్లికి ఏటా ఉత్సవాలను ఎంతో ఘనంగా గిరిజనులు నిర్వహిస్తారు.

వేడుకల వివరాలు

గంగమ్మతల్లి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపిన వివరాలు... సోమవారం రాత్రి అమ్మవారికి ఘటాల ఊరేగింపు..అనంతరం ఆలయంలో ప్రతిష్ఠ. ఈ సందర్భంగా బుడియాల సందడి, పలు సాంస్కృతి కార్యక్రమాలు జరుగుతాయి.

మంగళవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు. స్థానికులతో పాటు వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబసమేతంగా తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాలు నిర్వహణకు సంబంధించి అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వైద్య శిబిరం, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్పంచ్ వెంగడ రమేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షకార్యదర్శులు నాగేశ్వరరావు, మోహన్,కమిటీ సభ్యులు ఆలయంలో పనులను ఆదివారం పర్యవేక్షించారు.

బుడియాల మాలతో గిరిజనుల సందడి

శ్రీగంగమ్మతల్లి మొక్కుబడుల్లో భాగంగా అధిక సంఖ్యలో గిరిజనులు బుడియా మాల ధరిస్తారు. శరీరం అంతటా తెల్లటి సున్నంతో చారలుగా రాసుకొని కర్రలు చేతబట్టి, ప్యాంట్ మాత్రమే ధరిస్తారు. ఈ బుడియా మాలను ఏటా వందలాది మంది స్వీకరిస్తారు. వారం రోజుల పాటు నూనె వంటతో కూడిన ఆహారాన్ని స్వీకరించరు. బుడియా మాల ధారులు పాటలు పడుతూ గ్రామ గ్రామాల్లో తిరుగుతూ గంగమ్మతల్లి పండగపై ప్రచారం నిర్వహిస్తారు. గంగమ్మతల్లి ఉత్సవాలు పూర్తయ్యే వరకు బుడియాలు ప్రధాన పాత్ర పోషిస్తారు. వారం రోజుల పాటు గ్రామాల్లో సంచరించి డబ్బులు, బియ్యం, కూరగాయలు సేకరిస్తారు.అనంతరం సేకరించిన బియ్యం, కూరగాయలతో వంట చేసి సహపంక్తి భోజనాలు చేస్తారు.

ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు



సుజనకోటలో గంగమ్మ తల్లి ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసుశాఖ, రెవెన్యూశాఖ, మండల పరిషత్ శాఖలతో పాటు పలు శాఖల అధికారులతో విధుల నిర్వహణకు సిబ్బందిని అధికారులు నియమించారు. ఆలయానికి వెళ్లే కొండ ప్రాంతం అంతా దారిపొడువునా విద్యుత్ సౌకర్యం కల్పించాం. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం గంగమ్మతల్లి ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. 20వేల మందికి పైగా సరిహద్దు గ్రామాల నుంచి భక్తులు వస్తారని అంచనా వేస్తున్నాం. పార్కింగ్ సమస్య లేకుండా ప్రత్యేక స్థలం కేటాయించడం జరిగింది.

మండి నాగేశ్వరరావు,
ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, సుజనకోట గ్రామం

పుట్టగొడుగుల పెంపకం.. ఉపాధికి మార్గం

- మష్‌రూమ్ పెంపకంపై శిక్షణ
- మహిళల ఆర్థిక బలోపేతం

రంపచోడవరం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులైన గిరిజనులకు జీవనోపాధి మెరుగుపరిచేందుకు ఎస్ఎల్‌సీడబ్ల్యూ సహకారంతో ప్రకృతి స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. గిరిజన మహిళలకు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో 40 మంది గిరిజన మహిళలకు పుట్టగొడుగులు పెంపకంపై శిక్షణ ఇచ్చారు. దీంతో పైలెట్ ప్రాజెక్టుగా దేవీపట్నం మండలం ఇందుకూరుపేట సమీపంలోని సీతారాం, గుబ్బలంపాడు పోలవరం పునరావాస కాలనీల్లో పుట్టగొడుగులు పెంపకం చేపట్టారు. ఏజెన్సీలోనే పుట్టగొడుగుల పెంపకం చేపట్టడం ఇదే తొలసారి. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్. చిరంజీవి పర్యవేక్షణలో పుట్టగొడుగుల పెంపకం సత్ఫాలితాలను ఇస్తోంది. ఈ ఫలితాలు ఎక్కువ మొత్తంలో పుట్టగొడుగులు సాగుకు దోహదం చేస్తుంది.

40 రోజుల తర్వాత పంట సిద్ధం

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు సాధారణంగా వర్షాకాలంలో పుట్టల వద్ద లభించే పుట్టగొడుగులు సేకరించి ఆహారం తీసుకుంటారు. అలాగే ఎక్కువ మొత్తం సేకరిస్తే వాటి విక్రయిస్తారు. ఆర్అండ్ఆర్ కాలనీల్లో తొలిసారిగా చేపట్టిన పుట్టగొడుగులు పెంపకం గిరిజను మహిళాల ఆర్థిక బలోపేతానికి ఎంతో దోహదం చేస్తోంది. పుట్టగొడుగులు పెంపంకం సంయుక్తంగా చేపడుతున్నారు. పాలిథిన్ బ్యాగుల్లో స్పాన్ నింపిన తరువాత వాటిలో మైసీలియం వ్యాపించడంతో బ్యాగుల్లో మట్టిని నింపి 40 రోజులు ఉంచిన తరువాత కావడంతో పుట్టగొడుగులు పంట వస్తుంది.

పుట్టగొడుగులు పెంపకం కోసం సరైన ఉష్ణోగత్రను ఉంచడం, తేమ శాతం తగ్గకుండా చేయడంలో మహిళలు శిక్షణ పొందారు. పూర్తి అవగాహనతో పుట్టగొడుగులు పెరుగుదల ప్రారంభమైంది.



పుట్టగొడుగుల పెంపకం

ఎక్కువ మొత్తంలో సాగు



కేవీకె, ప్రకృతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో పుట్టగొడుగులు పెంపకంపై శిక్షణ పొందాం. స్వయంగా వాటిని సాగు చేయడంతో సాగులో పూర్తి మెలకువలు నేర్చుకున్నాం. అనుకున్న విధంగా పంట వస్తుంది. ఇప్పుడు మరింత ఎక్కువ స్థాయిలో పుట్టగొడుగులు పెంపకం చేస్తాం. అలాగే శిక్షణలో పుట్టగొడుగులతో విలువ ఆధారిత పదార్థాల తయారీపై శిక్షణ ఇచ్చారు.

– శిరసం భవానీ, సీతారాం, ఆర్అండ్ఆర్ కాలనీ

పూర్తి సహకారం



కేవీకె ద్వారా శిక్షణ పొందిన మహిళలు పుట్టగొడుగుల సాగు బాగుంది. శిక్షణ పొందిన మహిళలకు కేవీకె ద్వారా పూర్తి సహకారం ఉంటుంది. వారికి పుట్టగొడుగులు పెంపకానికి కావల్సిన స్పాన్, భద్రపరచడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కల్పించాం. పుట్టగొడుగులు పెంపకంపై ఉపాధి అవకాశాలు ఉంటాయి.

– డాక్టర్ చిరంజీవి, కె.వి.కె.శాస్త్రవేత్త

మహిళలకు ఉచిత శిక్షణ



పునరావాస కాలనీలో మహిళలకు జీవనోధి పెంపొందించే విధంగా కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా పుట్టగొడుగుల పెంపకంపై ప్రకృతి స్వచ్ఛంద సంస్థ ద్వారా కేవీకె సహకారంతో శిక్షణ ఇచ్చాం. మెటిరియల్‌ను ఎస్ఎల్‌సీడబ్ల్యూ సహకారంతో వారికి అందజేశాం. తాటి ఆకులతో బొమ్మలు, విలువధారిత వస్తువులు తయారీలో శిక్షణ ఇవ్వనున్నాం.అలాగే నిర్వాసిత మహిళలు 100 మందికి కుట్టు శిక్షణ, మగ్గం వర్క్‌పై శిక్షణ ఇచ్చాం.

– జి.సుబ్బరాజు, డైరెక్టర్, ప్రకృతి స్వచ్ఛంద సంస్థ, ఎన్‌జీవో, దేవీపట్నం

ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షకు 87.7 శాతం హాజరు



ఏయూలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్



పరీక్ష అనంతరం బయటకు వస్తున్న అభ్యర్థులు

అల్లిపురం (విశాఖ దక్షిణం): ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష నగరంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 35 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి 1 గంట వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 పరీక్ష నిర్వహించారు. మొత్తం 87.7 శాతం అభ్యర్థులు పరీక్ష లకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఏయూలో పరీక్ష కేంద్రాన్ని పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ స్వయంగా పరిశీలించారు.

రేపటి నుంచి తెలుగు ప్రాశస్త్యంపై అంతర్జాతీయ సదస్సు



సదస్సు వివరాలు విడుదల చేస్తున్న విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు

ఏయూక్యాంపస్: ఏయూ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం–తెలుగు ప్రాశస్త్యం అనే అంశంపై ఈనెల 21, 22 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. ఏయూ తెలుగు విభాగం సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అంతర్జాతీయ సదస్సు కార్యక్రమ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మాతృభాషా ప్రాశస్త్యాన్ని భావితరాలకు వారసత్వ సంపదగా అందించాలనే లక్ష్యంతో ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సుకు ప్యారిస్ నుంచి ఆచార్య డేనియల్ నేజర్స్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంతాచార్యులు ఆచార్య శలాక రఘునాథశర్మ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య కప్పగంతుల శ్రీనివాస్ తదితర తెలుగు పండితులు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆచార్యులు ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి యోహాన్ బాబు, సదస్సు సమన్వయకర్తలు డా బూసి వెంకటస్వామి, డా మూర్తి రేమెళ్ల, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త శ్రీ పి.కన్నయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన కొండలరావు

మాడుగుల: మండలంలోని డి.సురవరం మోదకొండమ్మ ఆలయం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలు.. మండలంలో ఎం.కోడూరు గ్రామానికి చెందిన సీహెచ్. కొండలరావు లోతుగెడ్డ పీహెచ్‌సీలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తూ విశాఖపట్నంలో నివాసముంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఆయన విశాఖ నుంచి ఎం.కోడూరుకు శనివారం రాత్రి తన బైక్ మీద బయలుదేరాడు. డి.సురవరం మోదకొండమ్మ ఆలయం సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయాడు.దీంతో తీవ్రంగా గాయపడ్డాడు.స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం ఆయనను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నలుగురు పందెంరాయుళ్ల అరెస్టు

10 కోళ్లు స్వాధీనం

గొలుగొండ: చిన్నయ్యపాలెం గ్రామంలో జరిగిన జానికిలమ్మతల్లి జాతర సందర్భంగా కోడి పందాలు ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పది కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య ఎస్ఐలు నారాయణరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాస్సే డైనాస్టార్ పోటీ-2023లకు దరఖాస్తుల ఆహ్వానం

బీచ్‌రోడ్డు: వ్యవసాయ రంగంలో వినూత్న ఆలోచనలకు పట్టంకట్టేందుకు ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టాఫే) శ్రీకారం చుట్టింది. మాస్సే డైనాస్టార్–2023 పోటీలను నిర్వహిస్తున్నట్టు ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్మెంట్ సంస్థ ఎండీ మల్లికా శ్రీనివాసన్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం కోసం వినూత్న పరిష్కారాలు, మెళకువలు, డైనాట్రాక్ వినియోగం, సమాజాన్ని విస్తృత స్థాయిలో ప్రభావం చేసే అంశాలను వినూత్నమైన రీతిలో 10 నిమిషాల మించకుండా వీడియోను రూపొందించి పంపాలన్నారు. పోటీలో పాల్గొనాలనుకునే వారు https://masseyfergusonindia.com/DYNASTAR/ వెబ్‌సైట్‌లో ఈ నెల 27లోగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. విజేతకు రూ.7.5లక్షల విలువైన బహుమతి, షార్ట్ లిస్ట్ అయిన వారికి రూ.5 వేల విలువైన బహుమతులు అందజేస్తామన్నారు.

పాత ఇనుప దుకాణంలో చోరీ

రూ.1.15 లక్షల నగదు అపహరణ

అనకాపల్లిటౌన్: పాత ఇనుప దుకాణంలో రూ.1.15లక్షల నగదు చోరీకి గురైనట్టు రూరల్ పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్ఐ సీహెచ్.నర్సింగరావు తెలిపిన మేరకు వివరాలు..మండలంలో మారేడుపూడి గ్రామానికి చెందిన బొండా శంకరరావు అదే గ్రామంలో పాత ఇనుప దుకాణం నిర్వహిస్తున్నారు. షాపు అభివృద్ధి కోసం తన తల్లివద్ద ఉన్న బంగారు నగలను ఈనెల 17న విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో కుదవపెట్టి రూ.1.15 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అదేరోజు రాత్రి తల కింద నగదును పెట్టుకుని దుకాణంలో నిద్రపోయాడు. 18వ తేదీ తెల్లవారు జామున నిద్రనుంచి లేచి చూసేసరికి నగదు, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ కనిపించలేదు. చోరీ జరిగినట్టు గుర్తించి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

నూకతాత జాతర ప్రారంభం

నక్కపల్లి: ప్రసిద్ధి గాంచిన రాజయ్యపేట నూకతాత తిరునాళ్లు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మత్స్యకారులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనే నూకతాత పండగను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. పండగ సందర్భంగా విద్యుత్ దీపాలంకరణ, సెట్టింగులు ఏర్పాటు చేశారు. పూరీ, పారాదీప్, శ్రీశైలం, నందికొండ నాగార్జున సాగర్, ఉప్పాడ, కాకినాడ, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన మత్స్యకారులంతా ఆదివారం సాయంత్రానికి రాజయ్యపేట చేరుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పొక్లెయిన్ ఢీకొని వృద్ధుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన దేముడు

కె.కోటపాడు : కింతాడలోని రామచంద్రపురం వద్ద శనివారం రాత్రి పొక్లెయిన్ ఢీకొని కూండ్రపువానిపాలెం గ్రామానికి చెందిన నెక్కల దేముడు(80) అనే వృద్ధుడు మృతి చెందాడు. పినగాడి నుంచి కె.కోటపాడు వైపు వస్తున్న పొక్లెయిన్ అదే మార్గంలో పాన్‌షాపునకు వచ్చి ఇంటికి నడుచుకుని వెళ్తున్న దేముడును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయనను 108 వాహనంలో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి కుమారుడు నెక్కల ఈశ్వర నరసింహ అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ కేసు నమోదు చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య, కుమారుడు ఉన్నారు.

నలుగురు జూదరులపై కేసు

అనకాపల్లిటౌన్: మండలంలోని దిబ్బపాలెం శివారులో లాటరీ బల్లాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్.నర్సింగరావు ఆదివారం చెప్పారు. వారి వద్ద నుంచి రూ.3,450 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్

- ఇంటర్ చదువుతోనే కొలువు గ్యారెంటీ
- పారామెడికల్ కోర్సులకు డిమాండ్
- కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం
- అప్రెంటిస్ శిక్షణతో అవకాశాలు
- ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖలో ప్రత్యేక వృత్తి విద్య కాలేజీ
- ప్రైవేటు కాలేజీలకు దీటుగా చదువులు



వృత్తి విద్య కాలేజీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చేస్తున్న విద్యార్థినులు

విశాఖ విద్య: యువతరం ఆలోచన దృక్పథం మారుతోంది. స్వశక్తితో సత్వరమే ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో అనువైన మార్గాలను అన్వేషిస్తున్నారు. సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ఇంటర్ వృత్తి విద్య కోర్సుల వైపు మొగ్గ చూపుతున్నారు. విద్యార్థుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా వృత్తి విద్యలో సరికొత్త కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తోంది. కొలువు గ్యారెంటీ కావడంతో నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా వృత్తి విద్య కోర్సుల్లో చేరుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ఫోకస్ పెట్టారు.

వృత్తి విద్యకు ప్రత్యేకం

ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన విద్యార్థుల కోసం నగరంలోని మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 2008–09 విద్యా సంవత్సరం నుంచి వృత్తి విద్య కోర్సులను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 339 కాలేజీలు ఉండగా, రెగ్యులర్ కోర్సులతో పాటు, పలు కాలేజీల్లో వృత్తి విద్యను సైతం నిర్వహిస్తున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 12,551 మంది విద్యార్థులు వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందగా, ఇందులో ఒక్క డాక్టర్ వి.ఎస్. కృష్ణ కాలేజీలోనే 913 మంది చదువుతున్నారు.

పారామెడికల్ కోర్సులకు డిమాండ్

సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించే మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, ఫిజియోథెరపీ వంటి పారామెడికల్ కోర్సులకు విద్యార్థుల నుంచి మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సులకు ప్రైవేటు కాలేజీల్లో అయితే రెండేళ్లకు రూ.30 వేల వరకు వ్యయం అవుతుంది. కానీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కాలేజీల్లో అడ్మిషన్ ఫీజు రూ.2,200, పరీక్ష ఫీజుగా రూ.600 చెల్లిస్తే చాలు. ప్రైవేటు కాలేజీలకు దీటుగా చదువులు సాగుతుండటం, ఫీజు కూడా తక్కువ కావడంతో ప్రభుత్వ కాలేజీల్లో చేరేందుకే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు.

కొలువులు వచ్చేలా కోర్సులు

అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్, ఆఫీస్ అసిస్టెంట్ షిప్, బ్యాంకింగ్, రిటైల్ మార్కెటింగ్ వంటి కామర్స్ మెనేజ్‌మెంట్ కోర్సులు చేసిన వారిని ఉద్యోగాల్లో తీసుకునేందుకు కార్పొరేట్ కంపెనీలు ముందుకొస్తుండడంతో వీటికి కూడా మంచి ఆదరణ ఉంది. ఇదే మాదిరిగా మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్, ప్రింటింగ్ టెక్నాలజీ వంటి కోర్సులను కాలేజీల్లో నిర్వహిస్తున్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌పై దృష్టి



ఇంటర్మీడియెట్ స్థాయిలో వృత్తి విద్య అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందేలా ఏర్పాట్లు చేశాం. పేరొందిన కార్పొరేట్ కంపెనీలతో ప్రభుత్వం చేసుకున్న ముందస్తు ఒప్పందం మేరకు, వారే కాలేజీలకు వచ్చి విద్యార్థులను ఉద్యోగాల్లో తీసుకుంటున్నారు. కాలేజీల్లో నాణ్యమైన బోధన అందించేలా పర్యవేక్షణ చేస్తున్నాం.

– ఆర్.సత్యనారాయణ,
జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, విశాఖపట్నం

బోధనపై ప్రత్యేక శ్రద్ధ



వృత్తి విద్యకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ బోధిస్తున్నాం. గతంలో అప్రెంటిస్ శిక్షణ కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడేవారు. కానీ ఇప్పుడు ఆ సమస్య లేదు. రెండేళ్ల కోర్సు పూర్తి అయిన తరువాత, ఎక్కడ అప్రెంటిస్ చేయాలనేది ముందుగానే విద్యార్థికి చెబుతున్నాం. అప్రెంటిస్ శిక్షణ సర్టిఫికెట్‌తో పాటు, నెలకు కొంత ఆర్థిక ప్రయోజనం కూడా పొందే అవకాశం ఉంది.

– ఎస్.భీమేశ్వరరావు, ప్రిన్సిపాల్, డాక్టర్ వి.ఎస్.కృష్ణ
వృత్తి విద్య కాలేజీ, విశాఖ

అప్రెంటిస్ శిక్షణతో గుర్తింపు



ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చేసిన వారికి గతంలో అప్రెంటిస్ షిప్ అవకాశం లేక, పారామెడికల్ బోర్డు గుర్తింపు ఇచ్చేది కాదు. దీని వల్ల కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. కానీ ప్రస్తుతం ఆ సమస్య లేదు. రెండేళ్ల కోర్సు పూర్తయిన వెంటనే ఆస్పత్రుల్లో శిక్షణకు పంపిస్తున్నాం. పారామెడికల్ బోర్డు గుర్తింపు ఇస్తోంది.

– కె.గౌరి, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫ్యాకల్టీ,
విశాఖపట్నం